సిద్దిపేట | శనివారం | 04-010-2025 | సంపుటి: 3 | సంచిక: 126 | పేజీలు: 8 | వెల:రూ.2/- https:yaadharthavaadhi.in ఎడిటర్: బింగి సత్తయ్య
CIRCULATED IN HYDERABAD, SIDDIPET, SANGAREDDY, KARIMNAGAR, WARANGAL, KHAMMAM, NIZAMBAD, MAHBOOBNAGAR, KARNOOL, VIJAYAWADA, GUNTUR, RAJAMUNDRY, VIZAG



## విదేశీ విద్యార్థులపై ట్రంప్ కొరడా

పరిమిత సంఖ్యలోనే విద్యార్థులకు అడ్మిషన్లు
యూనివర్సిటీలకు హుకూం జారీచేసిన వైట్‌హౌజ్

.. వివరాలు 3లో



## కరూర్ తొక్కిసలాట ఘటనపై సిట్

తమిళనాడు నార్త్ జోన్ ఐజీ అస్రాగార్గ్ నేతృత్వం
రాష్ట్ర, జాతీయ హైవేలపై రాజకీయ పార్టీల సభల నిషేధం
మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు

.. వివరాలు 3లో

## విండోస్ 10కు కాలం చెల్లినట్లే




14 నుంచి అందుబాటులోకి విండోస్ 11 వర్షన్
కొనసాగించాలనుకునే వారికి సెక్యూరిటీ కోడ్ ఉండదని హెచ్చరిక

.. వివరాలు 3లో

# ఫలక్‌నుమా ఆర్వోబీ ప్రారంభం

- పాతబస్తీ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం
- లాంఛనంగా ఓపెనింగ్ చేసిన మంత్రి పొన్నం



చంద్రాయణగుట్ట నియోజకవర్గం, పాతబస్తీ వాసులకు ఇక ట్రాఫిక్ కష్టాలు తీరాయి. హైదరాబాద్‌లోని పాతబస్తీ వాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఫలక్‌నుమాలో మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్త రోడ్ ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు. ఫలక్‌నుమా రైల్వేట్రాక్‌పై పాత ఆర్‌ఓబీ ఇరుకుగా మారడంతో, దానికి సమాంతరంగా కొత్తగా మరో బ్రిడ్జిని నిర్మించింది జీహెచ్‌ఎంసీ. రూ. 52.3 లక్షల వ్యయంతో, 360 మీటర్ల పొడవుతో రెండు లైన్స్‌గా ఈ రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. దీంతో బార్కాస్ జంక్షన్ నుంచి ఫలక్‌నుమా బస్ డిపో వరకూ ట్రాఫిక్ కష్టాలను తగ్గనున్నాయి. 02

# మాజీ మంత్రికి నివాళి

- కాంగ్రెస్ పెద్ద నాయకుడిని కోల్పోయిందని సీఎం వెల్లడి
- దామోదర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించి, ఆయన కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించారు. 02



## 'విలువలతో కూడిన వృద్ధి'కి కేరాఫ్ తెలంగాణ



- పారిశ్రామికాభివృద్ధికి అనుకూలం, అవకాశాల ఖని
- పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానం
- 'జీటో కనెక్ట్ 2025' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు
- కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, కిషన్‌రెడ్డి హాజరు



## అందరం కలసి ఉండాలన్నదే అలయ్ బలయ్

- కులమతాలతో విడదీసి పబ్బం గడుపుకోవాలనుకుంటే కుదరదు
- ఎక్కడో ఏదో జరిగిందని .. ఇక్కడా జరుగుతుందటే పొరపాటు
- భిన్నత్వంలో ఏకత్వం మన బలం అన్న వెంకయ్య

హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3: వేషభాషలు వేరయినా అందరం భారతీయులమనే భావనతో కలిసి ముందుకెళ్తున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులను దత్తాత్రేయ సత్కరించారు.



ఎలాంటి ఒడిదుడుకులనైనా ఎదుర్కొనే సత్తా
కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

## పటిష్టంగా భారత్ ఆర్థిక వ్యవస్థ

న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిర్మాణాత్మక మార్పును చూస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. హఠాత్తుగా వచ్చిపడే షాక్‌లను స్వీకరిస్తున్న భారత సామర్థ్యం బలంగా ఉందన్నారు. ఎలాంటి ఒడిదుడుకులనైనా ఎదుర్కొనే సత్తా మనకు ఉందన్నారు. శుక్రవారం దిల్లీలో కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్ 2025లో ఆమె పాల్గొన్నారు.


## ఇక వెంటనే చెక్ క్లియరెన్స్




ఆర్‌బీఐ సూచనలతో బ్యాంకుల అమలు
నేటి నుంచే అమల్లోకి కొత్త విధానం

# ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం

**విజయవాడలో నేడు సీఎం చంద్రబాబు శ్రీకారం**



- అమరావతి అభివృద్ధి పనుల వేగవంతానికి ఎస్‌పీవీ ఏర్పాటు
- అమరావతిలో ఇక భూ సేకరణ ద్వారా భూముల సమీకరణ
- ఈ నెల 16న ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై మంత్రులకు దిశానిర్దేశం
- జలవనరుల శాఖ పనులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

## మనదేశ వాయుసేన సత్తా ఏమిటో చూపాం

**పాక్ మిగ్‌లను కూల్చేశాం: ఎయిర్ చీఫ్ మార్షల్**



న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వాయుసేన సత్తా ఎలాంటిదో ప్రపంచం చూసిందని వాయుసేన అధిపతి ఏపీ సింగ్ తెలిపారు. శత్రువుల స్థావరాలను గురిచూసి కచ్చితంగా కొట్టామని.. ఆ సమయంలో భారత్ శక్తిని ప్రపంచ దేశాలు చూశాయన్నారు. త్రివిధ దళాల సమన్వయంతో పాక్‌కు చెందిన పది ఫైటర్ జెట్ విమానాలను ధ్వంసం చేశామన్నారు.

## భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి

**కొలంబియా పర్యటనలో రాహుల్ వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ పాలనలోని భారత్‌లో ప్రజాస్వామ్య దాడులు జరుగుతున్నా యంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు.



కేబినెట్ సమావేశమై 20 అజెండా అంశాలపై చర్చించింది. ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ 2024-29 అనుబంధ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జలవనరుల శాఖకు సంబంధించి వివిధ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కారవాన్ పర్యాటకానికి, అమృత్ పథకం 2.0 పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి భూసేకరణ విషయంలో కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇవ్వని భూములను భూసేకరణ ద్వారా తీసుకునేందుకు ఆమోదం తెలిపింది. అమరావతిలో వివిధ పనుల వేగవంతానికి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది. అమరావతి సహా రాష్ట్రవ్యాప్తంగా పలు సంస్థలకు భూకేటాయింపుల



ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కుష్ఠు వ్యాధి పదం తొలగించేందుకు వీలుగా చట్టసవరణ చేయాలని నిర్ణయించింది. విద్యుత్ శాఖకు సంబంధించి పలు ప్రతిపాదనలకు, కార్మిక చట్టాల్లో పలు సవరణల ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. అలాగే, రాజధాని నిర్మాణం లో మరో కీలక ముందడుగు పడింది.రాజధాని అమరావతి కోసం భూ సేకరణ కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. భూములు ఇవ్వని కొందరు రైతుల నుంచి భూసేకరణ చట్టం 2013 ద్వారా భూములు తీసుకోవాలని కేబినెట్. లో నిర్ణయం తీస్కున్నారు మేరకు ఏపీ క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతిలో పనుల కోసం ఎస్‌పీవీ ఏర్పాటుకు ఆమోదం లభించింది. పలు సంస్థలకు భూ కేటాయింపులు చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. అలాగే, కార్మిక చట్టాల్లో పలు సవరణల ప్రతిపాదనలకు సైతం మంత్రి మండలి ఆమోదం లభించింది.

## ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడరాదు

**అమరావతి, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3:** అసెంబ్లీలో కొందరు ఎమ్మెల్యేలు ఇష్టారీతిన మాట్లాడారు.. వారిని నియంత్రించాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని సీఎం చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జి మంత్రుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత పలు అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. శాఖాపరంగా ఎలాంటి విమర్శలొచ్చినా గట్టిగా స్పందించాలి. చరిత్రలో తొలిసారి 93శాతం రిజర్వాయర్లు నింపాం. విజన్-2047లోని 10 సూత్రాల్లో ఇదో కీలక పరిణామం. పూర్వోదయ పథకం ద్వారా ఉద్యాన, ఆక్వా రంగాల్లో రాష్ట్రానికి రూ.65వేల కోట్లు వచ్చే అవకాశముంది. అన్ని ప్రాంతాల్లోనూ విజయవాడ ఉత్సవ్ తరహాలో ఈవెంట్లు పెట్టాలి. స్థానిక పండుగలను ప్రోత్సహించేలా నెలకో ఈవెంట్ పెట్టాలి. కడపలో జిందాల్ ఉక్కు పరిశ్రమను 2028లోపు పూర్తి చేస్తాం. ఈ నెల 16న ప్రధాని కర్నూలు పర్యటనను విజయవంతం చేయాలని సీఎం సూచించారు.అయితే, చామ్ విధానంలో పట్టణాభివృద్ధి చేపట్టిన నిర్మాణాలు ఇతర శాఖలు అందిపుచ్చు కోవాలని సీఎం చంద్రబాబు తెలిపారు. పూర్వోదయ పథకంలో ఏపీకి స్థానం లభించిన విషయాలు మంత్రులతో పంచుకు న్నారు. ఏ పథకం ద్వారా దాదాపు రూ. 65 వేల కోట్లు ఉద్యాన, ఆక్వా రంగాలకు వచ్చే అవకాశం ఉంది. యానిమల్ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.. విజయవాడ ఉత్సవ్ తరహాలో నెలకో ఈవెంట్ రాష్ట్రంలో స్థానిక పండుగల్ని ప్రోత్సహించేలా అన్ని ప్రాంతాల్లో చేపట్టాలి అన్నారు. కర్నూల్ లో ఈ నెల 16వ తేదీన ప్రధాని మోడీ పర్యటన విజయవం తం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.


## అరకు కాఫీకి ఛేంజ్ మేకర్ అవార్డు



**అమరావతి :** జీఐ ట్యాగ్ పొందిన తర్వాత అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ బ్రాండ్‌గా మారిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అరకు కాఫీకి ఛేంజ్ మేకర్ అవార్డుపై సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. సీఎంను కలిసి అవార్డు, ప్రశంసా పత్రంను మంత్రి సంధ్యారాణి, జీసీసీ ఎండీ అందజేశారు. అరకు కాఫీ ద్వారా జాతీయ స్థాయిలో బిజినెస్ లైన్ ఛేంజ్ మేకర్ అవార్డును గిరిజన సహకార సంస్థ దక్కించుకుంది. అరకు వ్యాలీ కాఫీకి ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో అవార్డు దక్కడంపై గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ ఎండీ కల్పన కుమారికి ముఖ్యమంత్రి ప్రశంసించారు.బిజినెస్ లైన్ నుంచి స్వీకరించిన అవార్డును, ప్రశంసా పత్రాన్ని పరిశీలించారు సీఎం. ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రీయ విధానంలో సాగు అవుతున్న అరకు కాఫీ స్వచ్ఛత, సువాసనలతో పాటు ప్రత్యేక రుచిని కలిగి ఉందని చెప్పుకొచ్చారు. ఈ విశిష్టత కారణంగా అరకకు మంచి బ్రాండ్ అనే పేరు వచ్చిందని తెలిపారు. కాఫీ సాగు ద్వారా అరకులోని గిరిజనుల జీవన శైలిలో మార్పు వచ్చిందని వెల్లడించారు. ఇటీవల జీసీసీ-టాటా కన్స్యూమర్ ప్రొడెక్ట్స్ లిమిటెడ్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో దేశంలో తొలిసారిగా ఆర్గానిక్ సాల్యూబుల్ కాఫీ ఉత్పత్తి కానుందని వివరించారు. నర్సీపట్నం సమీపంలోని మాకవం-పాలెం గ్రామంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు అయ్యిందని తెలిపారు. తద్వారా విలువ ఆధారిత ఉత్పత్తిగా బీన్ టు కప్ మోడల్ అభివృద్ధి కానుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# విదేశీ విద్యార్థులపై ట్రంప్ కొరడా

- పరిమిత సంఖ్యలోనే విద్యార్థులకు అడ్మిషన్లు
- యూనివర్సిటీలకు హుకూం జారీచేసిన వైట్‌హౌజ్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో హుకూం జారీచేశారు. విదేశీ విద్యార్థుల రాకపై ఆంక్షలు లాంటి కత్తి పెట్టారు. పరిమిత సంఖ్యలోనే వారిని అనుమతించాలని యూనివర్సిటీలను ఆదేశించారు. అమెరికా ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల అడ్మిషన్లను పరిమితం చేయాలని వైట్ హౌజ్ విశ్వవిద్యాలయాలకు తేల్చిచెప్పింది. ఈమేరకు ప్రతిపాదించిన నిబంధనలను మెమో రూపంలో దేశంలోని ప్రధాన యూనివర్శిటీలకు పంపింది. ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి, జాతి, లింగ ఆధారిత నియామకాలు నిలిపివేయడం, విద్యార్థుల అడ్మిషన్ సమయంలో కచ్చితంగా ప్రామాణిక పరీక్ష నిర్వహించడం వంటివి చేపడితేనే ప్రభుత్వ నిధుల కేటాయింపులో ప్రాధాన్యం లభిస్తుందని వెల్లడించింది. ఈ నిబంధనలను అంగీకరించిన విశ్వవిద్యాలయాలు ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధిని పొందవచ్చని ఆ లేఖలో వెల్లడించారు. వీటిల్లో విద్యార్థులకు ప్రభుత్వ రుణాలు, గ్రాంట్లు, కాంట్రాక్టులు, రీసెర్చి నిధులు, విదేశీ స్కాలర్స్‌కు వీసా అనుమతులు, ట్యాక్స్ కోడ్‌లో ప్రాధాన్యం వంటివి పొందవచ్చని పేర్కొంది. అమెరికాలో ఉన్నతవిద్యను పునర్ వ్యవస్థీకరించి తమ భావజాలానికి అనుకూలంగా మార్చుకోవడానికి ట్రంప్ కార్యవర్గం చేస్తున్న మరో యత్నంగా దీనిని భావిస్తున్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం ప్రభుత్వంతో 500 మిలియన్ డాలర్ల డీల్ చాలా దగ్గరగా ఉందని పేర్కొన్నారు. వైట్‌హౌస్ నుంచి లేఖలు అందుకొన్న వాటిలో అమెరికాలోని ఎంఐటీ సహా ప్రముఖ విశ్వవిద్యాలయాలు మొత్తం ఉన్నాయి. ఈ క్రమంలో విదేశీ వీసాలపై వచ్చే విద్యార్థుల సంఖ్య 15 శాతానికి మించి ఉండకూడదు. ఒకే దేశం నుంచి వచ్చిన విద్యార్థుల సంఖ్య 5 శాతానికి మించకూడదు. విదేశాల నుంచి అందే నిధుల వివరాలను బహిర్గతం చేయాలి. విద్యార్థుల అడ్మిషన్, ఫైనాన్షియల్ ఎయిడ్ సమయంలో లింగ, జాతి, జాతీయత, రాజకీయ భావజాలం, జెండర్ ఐడెంటిటీ, లైంగిక ఆకర్షణ, మతపరమైన అంశాలు పరిగణనలోకి తీసుకోకూడదు.అండర్ గ్రాడ్యుయేట్ దరఖాస్తుదారులు కచ్చితంగా ప్రామాణిక పరీక్షను పూర్తిచేయాల్సిందే. విద్యా స్వేచ్ఛను కాపాడే విధానాలు అమలుచేయాలి. సంప్రదాయవాద ఆలోచన సరళిని ఇబ్బందిపెట్టే, దాడులకు పాల్పడే యూనిట్స్‌ను తొలగించడం వంటివి ఉన్నాయి. విద్యాలయాలను ఇబ్బందిపెట్టేలా రాజకీయ ప్రదర్శనలు, విద్యార్థులను లేదా గ్రూపులను వేధించకుండా చర్యలు చేపట్టాలి. ఉద్యోగులు అధికారిక విధుల సమయంలో రాజకీయ ప్రసంగాలు, చర్యలకు దూరంగా ఉండాలి. బాత్‌రూమ్‌లు, లాకర్ రూమ్‌లు లింగ ఆధారంగా వేర్వేరుగా ఉండాలి. హార్డ్‌సైన్స్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉచిత ట్యూషన్ ఫీజ్, ప్రోత్సాహకం కింద 2 మిలియన్ డాలర్లు మించి ఇవ్వాలని ప్రతిపాదించారు. ఈ నిబంధనలు ఏమేరకు అమలుచేస్తున్నారనే అంశాన్ని జస్టిస్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్స్‌ను సమీక్షించి తెలుసుకొంటుంది. వీటిని ఉల్లంఘిస్తే ప్రభుత్వ లబ్ధిని రెండేళ్లపాటు ఆపేస్తారు.

## వృద్ధురాలుకు మేమున్నాం అని భరోసా




గోదావరిఖని, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3: గోదావరిఖని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి విఠల్ నగర్ చెందిన వృద్ధురాలు శుక్రవారం తన పిల్లలు పట్టించుకోవడం లేదు అని వాళ్లకు నేను భారంగా ఉండటం ఎందుకు అని మనస్తాపం చెంది గోదావరి నదిలో దూకి చనిపోవాలని నిర్ణహించుకొని ఆటో ఎక్కి డ్రైవర్ కి గోదావరి నది వద్దకు వెళ్ళాలి నేను చనిపోతా అనడంతో.. ఆటో డ్రైవర్ పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకొచ్చాడు.. విషయం తెలుసుకొన్న రిసెప్షన్ సిబ్బంది వృద్ధురాలు ను సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి కి తెలిపారు. సీఐ వృద్ధురాలుకు నీకు మేము ఉన్నాం నీ పిల్లలు పట్టించుకోకపోయినా మాతో ఉంచుకుంటాం, చనిపోవడం సమస్య కాదు అని చెప్పి విఠల్ నగర్ ప్రాంతం లోని ఒక ప్రజా ప్రతినిధి మాట్లాడి వాళ్ళ ఇల్లు, కుటుంబం సభ్యుల వివరాలు తెలుసుకొని ఎస్ఐ అనూష, బ్లూ క్లోట్స్ సిబ్బంది నీ పంపించి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు.

# కాలనుగుణంగా కొత్త చట్టాలు

**కీలకం కానున్న రానున్న మూడేళ్లు**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3:** మారుతున్న సమాజానికి అనుగుణంగా చట్టాలు తీసుకుని వచ్చే ఆలోచనలో ప్రధాని మోడీ ఉన్నారని, పాతచట్టాలకు పాతరేయాల్సి ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంకా బ్రిటిష్ కాలం నాటి చట్టాలు కొనసాగడం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు చాలా కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతి శాఖ అనేక సంస్కరణలు తీసుకువస్తోందని చెప్పుకొచ్చారు. కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందని... వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. బ్రిటిష్ చట్టాలు ఇప్పటికీ అమలు అవుతున్నాయని తెలిపారు. వర్తమాన ప్రజల ఆలోచనలకు అనుగుణంగా చట్టాలు తేవాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆలోచిస్తున్నారని చెప్పుకొచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో ఆ పార్టీ స్టేట్ లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు, ఎంపీలు కె.లక్ష్మణ్, రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. అర్జున్ రామ్ మేఘవాల్ ఐఏఎస్‌గా ఉన్నప్పటికీ రాజీనామా చేసి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. బీజేపీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం పాలసీలకు అనుగుణంగా కోర్టుల్లో మనం వాదిస్తామనేది చాలా కీలకమని తెలిపారు. రానున్న మూడేళ్లు మోడీ ప్రభుత్వానికి చాలా కీలకమని ఉద్ఘాటించారు. అందుకు ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహించాలని మార్గనిర్దేశంచేశారు. కేంద్ర ప్రభుత్వ స్టాండ్ బలంగా వినిపించేందుకు ఎఫర్ట్ పెట్టాలని సూచించారు. తెలంగాణలో అధికారంలోకి బీజేపీ రావాలంటే అందరం కలసికట్టుగా పని చేయాలని కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. కాలం చెల్లిన చట్టాలను ప్రధానమంత్రి నరేంద్రమోడీ రద్దు చేశారని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. దేశాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేసేందుకు ఇతర దేశాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. ప్రధాని మోడీ విజనరీ లీడర్ కాబట్టి వేగంగా స్పందిస్తున్నారని చెప్పుకొచ్చారు. జీఎస్టీ తగ్గింపుతో దీపావళి వెలుగులను పేదల ఇళ్లల్లో మోడీ నింపుతున్నారని వివరించారు. అగ్రదేశాలు అడ్డగోలు టారిఫ్‌లతో భారతదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇండియా ఎదుగుదలను చాలా దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయని ఫైర్ అయ్యారు. స్వదేశీ వస్తువుల వినియోగించడం ద్వారా.. భారతదేశ ఆదాయం ఇతర దేశాలకు వెళ్లకుండా ఉంటుందని వెల్లడించారు. దీని ద్వారా పెట్టుబడులు పెరుగుతాయని... ఇతరులకు ఉపాధి కలుగుతోందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం దక్కాలని గత చట్టాలను రద్దు చేసి.. భారత న్యాయ సంహిత చట్టాలను మోడీ సర్కార్ తెచ్చిందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. హైదరాబాద్ నడి రోడ్డుపై గతంలో ఓ న్యాయవాది దంపతులను నరికి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు వేసిన వాళ్లను వెనక్కి తీసుకోకపోతే హత్య చేశారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ప్రస్తుతం జరుగుతోందని వివరించారు. న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు దేశంలో రావాలని రాంచందర్ రావు ఆకాంక్షించారు.

## ఉమ్మడి కరీంనగర్ కాంగ్రెస్ నాయకులతో తుమ్మల మీటింగ్



**హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3:** కాంగ్రెస్ ఉమ్మడి కరీంనగర్‌ముఖ్య నాయకులతో శనివారం మినిస్టర్స్‌క్వార్టర్స్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరు ,అభ్యర్థుల ఎంపిక, అభ్యర్థులు విజయం సాధించడానికి తీసుకోవాల్సిన వ్యూహాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి అభ్యర్థుల బాధ్యత తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్, నరేందర్ రెడ్డి ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## వాయుసేన సత్తా ఏమిటో చూపాం



త్రివిధ దళాల సమన్వయంతో పాక్‌కు చెందిన పది ఫైటర్ జెట్ విమానాలను ధ్వంసం చేశామన్నారు. వాటిలో ఎఫ్-16, ఎఫ్ -17 యుద్ధ విమానాలు ఉన్నట్లు తెలిపారు. పాక్‌లోని దాదాపు 300 కి.మీ.ల లక్ష్యాలను ఛేదించినట్లు ఆ దేశాన్ని మోకాళ్లపై కూర్చొనేలా చేశామన్నారు. ఆపరేషన్ సమయంలో కేంద్రం సైన్యానికి పూర్తి స్వేచ్ఛనివ్వడంతో మన సైన్యం శత్రుదేశానికి చుక్కలు చూపించిందని పేర్కొన్నారు. ఇతర దేశాలతో ఘర్షణలు తలెత్తిన సమయాల్లో వాటిని ఎదుర్కోవాలి, పరిష్కరించుకోవాలనే విషయాలను భారత్ నుంచి నేర్చుకోవాలని ప్రపంచ దేశాలకు సూచించారు. భవిష్యత్తు సవాళ్లను అధిగమించేందుకు రక్షణరంగంలో స్వావలంభన కోసం 'సుదర్శన చక్ర'ను తయారుచేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఇప్పటికే త్రివిధ దళాలు పనిని ప్రారంభించాయని తెలిపారు. ఇకపోతే మనం ఆపరేషన్ సిందూర్ తరవాత ఇప్పుడు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నామని అన్నారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కునేందుకు కూడా సన్నద్ధంగా ఉన్నామన్నారు. మన అస్త్రశస్త్రాలు అన్నీ గేమ్ ఛేంజర్‌లేనని అన్నారు. స్వయంసహాయక శక్తితో భారత్ తిరుగులేని సామర్థ్యం సాధించిందని అన్నారు. మన ఆయుధ సంపత్తి తిరుగులేని దన్నారు.



27న జరిగిన తొక్కిసలాటలో 41మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటుకు మద్రాను హైకోర్టు శుక్రవారం నాడు ఆదేశించింది. ప్రామాణిక కార్యాచరణ విధానాలు రూపొందించేంత వరకూ రాష్ట్ర, జాతీయ హైవేల వెంబడి రాజకీయ పార్టీల ర్యాలీలపై తాత్కాలిక నిషేధం విధించింది. విజయ్ ర్యాలీలో తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తు కోరుతూ భారతీయ జనతా పార్టీ నేత ఉమా ఆనందన్ వేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. టీవీకే నేతలు ముందస్తు బెయిలు కోరుతూ దాఖలు చేసిన పిటీషన్లపై ఆదేశాలను జస్టిస్ సెంథిల్ కుమార్ రిజర్వ్ చేశారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొజీజర్లు ఖరారు చేసేంతవరకూ రాష్ట్ర, జాతీయ హైవేలపై రాజకీయ పార్టీలు ఎలాంటి బహిరంగ సభలు, కార్యక్రమాలు నిర్వహించకుండా హైకోర్టు తాత్కాలిక నిషేధం విధించింది. కరూర్ తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తు కోరుతూ బీజేపీ నేత వేసిన పిటీషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. మధురై హైకోర్టు బెంచ్‌ను ఆశ్రయించాలని సూచించింది. తమిళనాడు నార్త్ జోన్ ఐజీ అస్రాగార్గ్ నేతృత్వంలో సిట్ దర్యాప్తునకు హైకోర్టు ఆదేశాలిచ్చింది. నమక్కల్ ఎస్పీ కూడా ఇందులో ఉంటారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను తక్షణం సిట్‌కు అప్పగించాలని ఆదేశించింది హైకోర్టు. టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, జాయింట్ సెక్రటరీ సీటీఆర్ నిర్మల్ కుమార్ వేసిన ముందస్తు బెయిల్ పిటీషన్‌పైనా తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. నేపాల్‌లో జరిగిన తరహాలో రివల్యూషన్‌ను తమ పార్టీ తీసుకురానున్నట్టు పేర్కొంటూ టీవీకే నేత ఆధవ్ అర్జున్ చేసిన ట్వీట్‌పై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయనపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. తన ట్వీట్‌ను ఆధవ్ అర్జున్ ఆ తర్వాత తొలగించారు.

# భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి

మొదటి పేజీ తరువాయి



**న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3:** నరేంద్ర మోడీ పాలనలోని భారత్‌లో ప్రజాస్వామ్య దాడులు జరుగుతున్నా యంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశానికి అత్యంత ప్రమాదకరమైనది ఏదైనా ఉందంటే అది దేశంలో ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడేనంటూ మండిపడ్డారు. కొలంబియా పర్యటనలో ఉన్న ఆయన ఈఐఏ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత్‌లో ఎన్నో మతాలు, కులాలు, సంప్రదాయాలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రతిఒక్కరికీ చోటుకల్పిస్తుంది. కానీ ప్రస్తుతం ఈ వ్యవస్థ ముప్పేటదాడిని ఎదుర్కొంటోందన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇంధన వినియోగంలో వచ్చిన మార్పులతో అనేక సామ్రాజ్యాల సృష్టి జరుగుతూవస్తోంది. బ్రిటిష్‌వారు ఆవిరి యంత్రం, బొగ్గుపై నియంత్రణ సాధించారు. తర్వాత వారు సూపర్‌పవర్‌గా మారారు. ఆ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి 1947లో మేం స్వాతంత్ర్యం సాధించుకున్నాం. పెట్రోల్ వినియోగం పెరిగింది. ఆ క్రమంలో అమెరికన్ల పట్టుపెరిగింది. ప్రపంచం ఇప్పుడు ఎలక్ట్రిక్ మోటార్ వైపు మళ్లుతోంది. ఇప్పుడు పోటీ అమెరికా, చైనా మధ్య నెలకొని ఉంది. ఈ విషయంలో చైనానే ముందుంది. చైనాకు భారత్ పొరుగుదేశం. అమెరికాకు మిత్రదేశం. ఈ రెండు దేశాలు పోటీపడుతుంటే మధ్యలో మేం ఉన్నాం. చైనాకంటే భారత్ జనాభా ఎక్కువ. ఆ దేశంలో కేంద్రీకృత వ్యవస్థ ఉంది. ఇండియాలో వికేంద్రీకృత, వైవిధ్య వ్యవస్థ ఉంది. అది సంక్లిష్టంగా ఉంటుంది. చైనాతో పోల్చుకుంటే భారత్‌కున్న సామర్థ్యాలు భిన్నమైనవి. మా దేశం అధ్యాత్మిక, సైద్ధాంతిక సంప్రదాయాలను కలిగిఉంది. అవి ఈనాటికీ ఆచరణీయమైనవి. చైనాలాగా భారత్ తన ప్రజలను అణచి వేయదని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఆర్థిక వృద్ధి ఉంది. అయితే మాది సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థ. కానీ ఉత్పత్తి భారీ స్థాయిలో లేకపోవడంతో ఉద్యోగాల కల్పన ఆశించినస్థాయిలో లేదు. చైనా అప్రజాస్వామిక వాతావరణంలో ఉత్పత్తి చేస్తోంది. కానీ మాకు ప్రజాస్వామ్య వ్యవస్థే ఉండాలి. అలాంటి వ్యవస్థను అభివృద్ధి చేయడమే సవాలని పేర్కొన్నారు.



**న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3:** ప్రజాస్వామ్యంపై జరుగుతోన్న దాడి భారత్‌కు పొంచిఉన్న ముప్పు అని కొలంబియా పర్యటనలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై భారతీ-య జనతా పార్టీ ఘాటుగా స్పందించింది. ఇతర దేశాల్లో భారత్‌ను అవమానించడమే రాహుల్ పనని..దేశ ప్రజలను నిజాయితీ లేనివారిగా ఆయన చిత్రీకరిస్తున్నారని బాలీవుడ్ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడూ భారత్‌ను విమర్శించే కాంగ్రెస్ నేతను చూసి.. దేశ ప్రజలు అవమానకరంగా భావిస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ విదేశాల్లో దేశ ఖ్యాతిని పెంచుతుంటే..దానిని ఎలా తగ్గించాలా అని రాహుల్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఇటువంట పనులు చేయడం వల్ల ప్రజలకు వారిపై ఉన్న నమ్మకం పోయిందన్నారు. భాజపా నేత ప్రదీప్ భండారీ సైతం రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. భారతదేశాన్ని, దాని పురోగతిని ద్వేషించే వ్యక్తి మాత్రమే విదేశాలకు వెళ్లి దేశాన్ని అవమానిస్తాడని అన్నారు. ఇదే మనస్తత్వంతో గత 70 ఏళ్లుగా కాంగ్రెస్ పాలకులు దేశ అభివృద్ధిని అడ్డుకున్నారని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం చూసి..అసూయతో రాహుల్ ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన ఎప్పటికీ భారత్‌ను వ్యతిరేకించే నేతగానే మిగిలిపోతారన్నారు. ప్రస్తుతం కొలంబియా పర్యటనలో ఉన్న రాహుల్ ఈఐఏ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.



# బ్రహ్మోస్‌ను మించి ధ్వని క్షిపణి

### తయారీకి డీఆర్‌డీఓ రంగం సిద్ధం



**న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3:** బ్రహ్మోస్‌ను మించి ధ్వని క్షిపణి తయారీకి డీఆర్‌డీఓ రంగం సిద్ధం అవుతున్నట్లు సమాచారం. రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధిస్తున్న భారత్.. మరింతగా అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్ తరవాత తమ దృష్టిని పెంచింది. స్వదేశీ అధునాతన ఆయుధాల ఉత్పత్తికి పెద్దపీట వేస్తోంది. అధునాతన క్షిపణి వ్యవస్థలు, ఫైటర్ జెట్లు, డ్రోన్ల ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో హైపర్‌సోనిక్ క్షిపణి ప్రయోగాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ 'ధ్వని' పరీక్షలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని డీఆర్‌డీఓ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో దడ పుట్టించిన బ్రహ్మోస్ కంటే ఈ క్షిపణులు భీకరంగా పనిచేస్తాయని అంచనా. అత్యంత వేగంగా ప్రయాణిస్తూ సుదూర లక్ష్యాలను నిమిషాల్లో ఛేదించగల సామర్థ్యం హెచ్‌జీవీల సొంతం. శబ్ద వేగానికి ఐదారు రెట్ల కంటే అధిక వేగంతో ఈ క్షిపణులు ప్రయాణించగలవు. డీఆర్‌డీఓ సిద్ధం చేస్తోన్న హెచ్‌జీవీ సుమారు గంటకు 7వేలకుపైగా కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 1500 నుంచి 2వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదని అంచనా. వేగంతో పాటు దిశను మార్చుకునే సామర్థ్యం ఉండడంతో శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలకు స్పందించే సమయం కూడా ఇవ్వదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. హైపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణులకు భిన్నంగా ఈ నూతన గ్లైడ్ వెహికల్ ఉంటుంది. రాకెట్ సాయంతో అత్యంత ఎత్తుకు వెళ్లి.. అక్కడ నుంచి విడిపోయి హైపర్‌సోనిక్ వేగంతో లక్ష్యంవైపు దూసుకెళ్తుంది. శత్రువుల గగనతల నిరోధక వ్యవస్థలకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించే సామర్థ్యమున్న ఈ హెచ్‌జీవీ పరీక్షలను డీఆర్‌డీఓ ముమ్మరం చేసింది. ఇప్పటికే ఎయిర్‌ఫ్రేమ్ ఏరోడైనమిక్స్, థర్మల్ మేనేజిమెంట్, స్క్రామ్‌జెట్ ఇంజిన్ పనితీరు, గైడెన్స్ వ్యవస్థకు సంబంధించి క్షేత్రస్థాయి, వైమానిక పరీక్షలు చేసింది. ఈ ఏడాది చివరి నాటికి 'ధ్వని' పూర్తి స్థాయి పరీక్షలు జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# పటిష్టంగా ఆర్థిక వ్యవస్థ

**న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిర్మాణాత్మక మార్పును చూస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. హఠాత్తుగా వచ్చిపడే షాక్‌లను స్వీకరిస్తున్న భారత సామర్థ్యం బలంగా ఉందన్నారు. ఎలాంటి ఒడిదు దుకులనైనా ఎదుర్కొనే సత్తా మనకు ఉందన్నారు. శుక్రవారం దిల్లీలో కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్ 2025లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక, ఇంధన అసమతుల్యతను ఎదుర్కోవడం కూడా దేశాల ముందున్న కర్తవ్యం అని పేర్కొన్నారు. 'భౌగోళిక రాజకీయ సంఘర్షణలు తీవ్రమవుతున్నాయి. ఆంక్షలు, సుంకాలు, విభేదాలు ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బ తీస్తున్నాయి. ఇవి భారత్‌కు కూడా దెబ్బే. కానీ, వీటన్నింటినీ బలంగా ఎదుర్కొనే సామర్థ్యం మనకు ఉందని నిర్మల అన్నారు. మన ఆర్థిక పరపతి కూడా అభివృద్ధి చెందుతోంది. కొత్త సంకీర్ణాలు ఉద్భవిస్తున్నాయి. అయితే, మనం ఎదుర్కొంటున్నది తాత్కాలిక అంతరాయం మాత్రమే కాదు.. నిర్మాణాత్మక మార్పులు' అని ఆమె అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉందని, స్థిరంగా వృద్ధి చెందుతూనే ఉందని నిర్మలా సీతారామన్ తెలిపారు. యాదృచ్ఛికంగా భారత్ ఈ స్థాయికి రాలేదని, అనేక శక్తిమంతమైన సంస్కరణల ద్వారా వచ్చిందన్నారు. ఇందుకు అనేక విధాలుగా కసరత్తు చేసిందన్నారు. భారత్ ఆర్థిక పురోగతి కారణంగానే గట్టిగా నిలబడగలుగు తోందన్నారు.

# పెద్దనాన్న లైంగిక వేధింపులు

### కొంపల్లిలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

**హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3:** హైదరాబాద్ నగరంలోని కొంపల్లిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కంటికి రెప్పలా కాపాడాల్సిన పెదనాన్న నుంచే లైంగిక వేధింపులు ఎదురుకావడంతో వాటిని భరించలేని ఓ 17 ఏళ్ల ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ హృదయ విదారక ఘటన పోచమ్మగడ్డ ప్రాంతంలో గురువారం రాత్రి జరిగింది. పేట్ బషీరాబాద్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, నిజామాబాద్ జిల్లా వర్నికి చెందిన ఓ కుటుంబం ఉపాధి కోసం కొంపల్లికి వలస వచ్చి నివసిస్తోంది. ఈ దంపతుల పెద్ద కుమార్తె (17) స్థానికంగా ఉన్న ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతోంది. గతేడాది రోడ్డు ప్రమాదంలో బాలిక తండ్రి మరణించారు. ఆయన బతికున్నప్పుడు తన అన్నతో కలిసి మేడ్చల్‌లో ఫైనాన్స్‌లో కొంత రుణం తీసుకున్నారు. తండ్రి మరణం తర్వాత, ఆ అప్పు విషయం మాట్లాడాలనే నెపంతో పెదనాన్న తరచూ తమ్ముడి ఇంటికి రావడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బాలికను లైంగికంగా వేధించేవాడు. అతని వేధింపులు రోజురోజుకు ఎక్కువ కావడంతో ఆ బాలిక తీవ్ర మనోవేదనకు గురైంది. ఈ నరకాన్ని భరించలేక, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకుంది. విషయం తెలుసుకున్న బాలిక తల్లి గుండెలవిసేలా రోదించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నట్లు వారు వెల్లడించారు.

# మద్యం విక్రయాలకు దసరా కిక్కు

### పండగతో భారీగా అమ్మకాలు



**హైదరాబాద్, అక్టోబర్ 3:** తెలంగాణలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. దసరా కిక్కు ఇచ్చింది. అక్టోబర్ 2న దసరా రావడంతో ముందస్తుగానే 30, 1 తేదీల్లో భారగా మద్యం విక్రయలు జరిగాయి. ఈ ఏడాది సెప్టెంబరులోనే రూ.3,046 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 29న రూ.278 కోట్లు, 30న రూ.333 కోట్లు, అక్టోబర్ 1న రూ.86.23 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ 3 రోజుల్లోనే 60 నుంచి 80శాతం వరకు అమ్మకాలు పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు.. రాష్ట్ర వ్యాప్తంగా 29.92 లక్షల కేసుల లిక్కర్, 36.46 లక్షల కేసుల బీర్లు విక్రయించారు. గతేడాదితో పోలిస్తే 7శాతానికిపైగా మద్యం విక్రయాలు పెరిగాయి. మద్యం సేల్స్ పెరగడంతో ఎక్సైజ్ శాఖకు రాబడి పెరిగింది.

# పాక్ పేరు లేకుండా చేస్తాం

### ఉగ్రవాదాన్ని ఎగదోస్తే గట్టి సమాధానం

### ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరిక



**న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3:** ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం పాకిస్థాన్ కు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం నాడు దిమ్మతిరిగే వార్నింగ్ ఇచ్చారు. భారత్‌లో ఉగ్రవాదాన్ని స్పాన్సర్ చేసే చర్యలను పాక్ మానుకోకుంటే ఆ దేశం ప్రపంచ పటం నుంచి కనుమరుగవుతుందని హెచ్చరించారు. భారత బలగాలు ఆపరేషన్ సిందూర్లో చూపించిన సంయమనాన్ని ప్రతిసారీ చూపించలేవని అన్నారు. ఈసారి నిర్ణయాత్మక, అత్యంత శక్తివం తమైన సమాధానం ఇస్తుందని చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ 1.0లో చూపిన సంయ మనాన్ని ఈసారి చూపించం. ప్రపంచ పటంలో ఉండాలనుకుంటోందో, లేదో తేల్చుకునేలా ఈసారి పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఉంటుంది. ప్రపంచ పటంలో పాక్ ఉండదలిస్తే మాత్రం ఉగ్రవాదాన్ని స్పాన్సర్ చేయడం ఆపితీరాలి' అని జనరల్ ద్వివేది అన్నారు. బికనీర్ మిలట్రీ స్టేషన్‌తో సహా పలు ఫార్వార్డ్ ఏరియాల్లో శుక్రవారం నాడు ఉపేంద్ర ద్వివేది పర్యటించారు. బలగాల సన్నద్ధతను అంచనా వేసేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. మిలట్రీ సీనియర్ అధికారులు, వెటరన్స్, సివిల్ డిగ్నటరీలతో ఆయన సమావేశం అయ్యారు. ఆధునికీకరణ, యుద్ధ సన్నాహకాలు, అడ్వాన్సింగ్ టెక్నలాజికల్ సామర్థ్యాలు, ఆపరేషనల్ ఎక్సలెన్స్‌కు ఆర్మీ కృతనిశ్చయంతో ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# బాపూఘాట్ వద్ద గాంధీజయంతి



**హైదరాబాద్,యదార్థవాది విలేకరి, అక్టోబర్ 3:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లంగర్ హౌస్ లోని బాపూఘాట్ వద్ద గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. బాపూఘాట్ వద్ద నివాళులు అర్పించిన వారిలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా బాపూఘాట్ వద్ద సర్వమత ప్రార్థనల్లో గవర్నర్ పాల్గొన్నారు. దసరా రోజు కూడా కావడంతో గవర్నర్ తదితరులు పాల్గొని శుభకాంక్షలు తెలిపారు.

పూర్వం ఒకప్పుడు మన పెద్దలు, పూర్వీకులు ఆయుర్వేద ప్రకారం అనేక ఆహారపు అలవాట్లను పాటించే వారు. అందుకనే అప్పట్లో వారు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. వృద్ధాప్యం వచ్చినా కూడా దృఢంగా ఉండేవారు. కంటి చూపు మెరుగ్గా ఉండేది. ఎముకలు బలంగా ఉండేవి. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటివి కూడా సాధారణంగా వచ్చేవి కావు. కానీ ఇప్పుడు యుక్త వయస్సులో ఉన్నవారు కూడా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. గుండె పోటు వస్తోంది. డయాబెటిస్ సమస్య ఇబ్బందులకు గురి చేస్తోంది. ముఖ్యంగా రోగ నిరోధక శక్తి అసలు ఉండడం లేదు. కనుక చిన్న అనారోగ్య సమస్య వచ్చినా తట్టుకోలేకపోతున్నారు. హాస్పిటల్స్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. అయితే శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు గాను ఆయుర్వేద సూచించిన ఆహారపు అలవాట్లను పాటించాల్సి ఉంటుంది. వాటిల్లో ఒకటి.. రాగి పాత్రలో నిల్వ ఉంచిన నీళ్లను తాగడం. ఇలా చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది.



**రోగ నిరోధక వ్యవస్థకు..**

రాగి పాత్రలో నిల్వ ఉంచిన నీళ్లను తాగితే అనేక లాభాలు కలుగుతాయి. ఒకప్పుడు మన పూర్వీకులు, పెద్దలు ఈ నీళ్లనే ఎక్కువగా తాగేవారు. కనుకనే వారు చాలా ఆరోగ్యంగా ఉండేవారు. రాగి పాత్రలో నిల్వ ఉంచిన నీళ్లను తామ్ర జలం అని పిలుస్తారు. తామ్రము అంటే రాగి అని అర్థం. కనుక రాగి పాత్రలోని నీళ్లను తామ్ర జలం అని పిలుస్తారు. ఇక ఈ నీళ్లను తాగితే అనేక లాభాలు కలుగుతాయి. రాగి పాత్రలోని నీళ్లను తాగడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. దీంతో అజీర్తి ఉండదు. జీర్ణ వ్యవస్థలో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. రాగిలో శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. కనుక ఈ నీళ్లను సేవిస్తుంటే మన శరీరంలో ఉండే సూక్ష్మ క్రిములు నశిస్తాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది.

**బరువు తగ్గేందుకు..**

అధిక బరువు తగ్గాలనుకునే వారికి రాగి నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. రాగి నీళ్లలో ఉండే ఎంజైమ్‌ల కారణంగా శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. రాగి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. ఇది ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తుంది. శరీర కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. శరీరంలో మెలనిన్ ఉత్పత్తి అయ్యేలా చూస్తుంది. దీంతో చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తారు. అలాగే మెలనిన్ వల్ల శిరోజాలు తెల్లబడడం తగ్గుతుంది. జుట్టు నల్లగా మారుతుంది. ఒత్తుగా, దృఢంగా పెరుగుతుంది. వయస్సు మీద పడినప్పటికీ జుట్టు తెల్లబడదు. దీని వల్ల కూడా యవ్వనంగా కనిపిస్తారు. రాగి నీళ్లను తాగుతుంటే మెదడు ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. యాక్టివ్‌గా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు.

**జాగ్రత్తలు తప్పనిసరి..**

రాగి వల్ల మనం తినే ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరం సులభంగా శోషించుకుంటుంది. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రాగిలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల ఆర్థరైటిస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్ల నొప్పులు, వాపులు ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఇక రాగి పాత్రలో నీళ్లను 12 గంటలకు మించి నిల్వ ఉంచకూడదు. లేదంటే అందులో టాక్సిన్లు చేరే ప్రమాదం ఉంటుంది. రాగి పాత్రలు లేదా బాటిల్స్ లో సులభంగా ఆకుపచ్చని పాకురు లాంటి పదార్థం ఏర్పడుతుంది. కనుక పాత్రలను తరచూ శుభ్రం చేయాలి. అందుకు గాను నిమ్మరసం, వెనిగర్, బేకింగ్ సోడా వంటివి ఉపయోగించాలి. 100 శాతం స్వచ్ఛమైన రాగితో తయారు చేసిన పాత్రలనే ఉపయోగించాలి. రాగి పాత్రలో నిల్వ ఉంచిన నీళ్లను రోజుకు 1 లేదా 2 గ్లాసులు మాత్రమే తాగాలి. అధికంగా తాగకూడదు. మరీ చల్లగా లేదా వేడిగా ఉండే నీళ్లను రాగి పాత్రలో నిల్వ ఉంచకూడదు. దీని వల్ల ఆ నీళ్లు విషంగా మారే ప్రమాదం ఉంటుంది. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ రాగి పాత్రలోని నీళ్లను తాగితే ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చు.

# అకస్మాత్తుగా లేచి నిలబడితే తలతిరుగుతోందా?

## బీపీ తగ్గడమే దీనికి కారణమని తెలుసా



ఇంటర్నెట్ డెస్క్: కుర్చీల్లో కూర్చున్న వారు లేదా బెడ్‌పై పడుకున్న వారు లేచి నిలబడగానే తలతిరిగినట్టు అనిపిస్తుంది. తూలినట్టు అనిపిస్తుంది. కొందరిలో చూపు మసకబారినట్టు కూడా ఉంటుంది. అకస్మాత్తుగా బీపీ పడిపోవడమే ఇందుకు కారణమని వైద్యులు చెబుతున్నారు. వైద్య పరిభాషలో దీన్ని ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్ అని పిలుస్తారు (%ఎక్రీశీశీస జూతీవం-ంబతీవ ఎతీశీజూ శీఅ ర్ఖీఅఎఱఅస్త్ర).

**ఏమిటీ హైపోటెన్షన్..**

సడెన్‌గా నిలబడిన సందర్భాల్లో గురుత్వాకర్షణ వల్ల రక్తం కాళ్లవైపు వేగంగా ప్రవహిస్తుంది. ఫలితంగా గుండె, మెదడుకు రక్త సరఫరా తగ్గుతుంది. బీపీ తగ్గుతుంది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. రక్తనాళాలు కుంచించుకుంటాయి. ఇవన్నీ అప్పటికప్పుడు జరిగిపోతాయి కాబట్టి చాలా సందర్భాల్లో ఎలాంటి ఇబ్బంది ఉండదు. కొన్ని సమయాల్లో మాత్రం ఈ ప్రతిస్పందనలు ఆలస్యం కావడం లేదా తగినంత లేకపోవడం వల్ల బీపీ తగ్గినట్టు అనిపిస్తుంది.

వృద్ధులు, నీరు తగినంత తాగని వారిలో ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్ ముప్పు ఎక్కువని వైద్యులు చెబుతున్నారు. కొన్ని రకాల ఔషధాల వల్ల కూడా ఈ సమస్య వస్తుందని అంటున్నారు. ఈ తరహాలో బీపీ తగ్గినప్పుడు తలతిరగటం, అలసటగా అనిపించడం, నీరసం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటే ఒక్కోసారి మూర్ఛ కూడా వస్తుంది.

**నివారణ ఇలా..**

ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. తగినంత నీరు తాగడం వల్ల ఈ సమస్య చాలా తగ్గుతుంది. వృద్ధులు నెమ్మదిగా లేచి నిలబడితే కూడా ముప్పు తగ్గుతుంది. ఇక స్టాకింగ్స్ వంటి కంప్రెషన్ దుస్తులు ధరించడం కూడా కొంత సాంత్వన కలిగిస్తుంది. రక్తప్రసరణను మెరుగుపరిచే ఆహార నియమాలను పాటించాలి. ఇక తరచూ ఇలాంటి సమస్య ఎదురవుతున్న వారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.



# ఫ్యాటీ లివర్ ఉన్నవారిలో కనిపించే లక్షణాలు ఏమిటి..?

## ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి..?

ప్రస్తుతం చాలా మందికి ఉరుకుల పరుగుల బిజీ జీవితంలా మారింది. దీని వల్ల దాదాపుగా అందరికీ అనేక వ్యాధులు వస్తున్నాయి. వాటిల్లో ఫ్యాటీ లివర్ కూడా ఒకటి. ఫ్యాటీ లివర్‌ను వైద్య పరిభాషలో హెపాటిక్ స్టియాటోసిస్ అంటారు. లివర్‌లో అధికంగా ద్రవాలు చేరడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. దీన్నే సైలెంట్ డిసీజ్ అని కూడా అంటారు. ఫ్యాటీ లివర్ ఆరంభంలో ఉన్నప్పుడు ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ కొందరిలో పలు లక్షణాలు కనిపిస్తాయి. ఫ్యాటీ లివర్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే లివర్ డ్యామేజ్ అయి ప్రాణాంతకంగా మారే అవకాశాలు ఉంటాయి. ఫ్యాటీ లివర్ ఉన్నవారిలో తీవ్రమైన నీరసం కనిపిస్తుంది. ఆహారం తీసుకుంటున్నా, తగినంత నిద్ర కూడా ఉన్నా కూడా తీవ్రంగా నీరసం వస్తుంది. చిన్న పనిచేసినా అలసిపోతారు. శరీరంలో అధికంగా టాక్సిన్లు చేరడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. దీంతో ఫ్యాటీ లివర్ వస్తుంది.

**లక్షణాలు..**

ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారిలో పొట్టలో లేదా ఆ భాగంలో అసౌకర్యంగా అనిపిస్తుంది. కొందరికి నొప్పి కూడా ఉంటుంది. ఛాతి ఎముకల కింది భాగంలో నొప్పిగా కూడా ఉంటుంది. ముఖ్యంగా కుడి వైపు లివర్ ఉన్న చోట ఇది ఎక్కువగా వస్తుంది. లివర్ వాపులకు గురైతే ఇలా నొప్పి వస్తుంది. దీన్ని కూడా ఫ్యాటీ లివర్ వచ్చిందనడానికి సంకేతంగా చెప్పవచ్చు. ఈ వ్యాధి ఉన్నవారు అసాధారణ రీతిలో బరువు పెరుగుతారు. ముఖ్యంగా పొట్ట భారీగా పెరుగుతుంది. ఇన్సులిన్ నిరోధకత అధికంగా పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఇది ఫ్యాటీ లివర్‌కు దారి తీస్తుంది. కనుక ఈ లక్షణం కనిపించినా కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఫ్యాటీ లివర్ సమస్య ఉంటే వికారంగా అనిపిస్తుంది. వాంతికి వచ్చినట్లు ఉంటుంది. ఆకలి తగ్గుతుంది. ఆహారం అసలు తినాలనిపించదు.

**ఇలా కూడా అవుతుంది..**

ఫ్యాటీ లివర్ ఉండే ఇన్సులిన్ నిరోధకత కారణంగా చర్మం ముడతలు పడిన చోట నలుపు రంగులోకి మారుతుంది. మెడ భాగంలో, చంకల్లో నలుపు దనం ఎక్కువగా కనిపిస్తుంది. జుట్టు పలుచగా మారుతుంది. మొటిమలు ఎక్కువగా వస్తుంటాయి. ఇవన్నీ ఫ్యాటీ లివర్ ఉందని చెప్పేందుకు లక్షణాలుగా భావించవచ్చు. ఫ్యాటీ లివర్ ఉంటే కొందరికి పచ్చ కామెర్లు అవుతాయి. అందువల్ల పచ్చ కామెర్లు అయిన వారు ఫ్యాటీ లివర్ వచ్చిందేమో కూడా చెక్ చేయించుకోవాల్సి ఉంటుంది. అలాగే పాదాలు, పొట్ట భాగంలో వాపులు రావడం, ఏకాగ్రత లోపించడం, ఏ విషయంపై కూడా ధ్యాస పెట్టలేకపోవడం, చర్మం కింది భాగంలో సాలెగూడులా రక్త నాళాలు మారి బయటకు కనిపించడం వంటివన్నీ ఈ సమస్యకు సంకేతాలుగా చెప్పవచ్చు.

**తీసుకోవాల్సిన ఆహారాలు..**

ఫ్యాటీ లివర్ వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. మద్యం అతిగా సేవించడం, కొవ్వు ఉండే ఆహారాలను అధికంగా తినడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, స్థూలకాయం, డయాబెటిస్ ఉండడం, కొలెస్ట్రాల్ అధికంగా ఉండడం వంటివన్నీ ఫ్యాటీ లివర్‌కు దారి తీస్తాయి. ఫ్యాటీ లివర్ ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు క్రమం తప్పకుండా మందులను వాడడంతోపాటు ఆహారం విషయంలోనూ పలు మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఈ వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు అవకాశాలు ఉంటాయి. ఈ వ్యాధి ఉన్నవారు తాజా పండ్లు, కూరగాయలను అధికంగా తినాలి. ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలి. బెర్రీ పండ్లు, బీట్ రూట్ ఎంతో మేలు చేస్తాయి. ఓట్స్, బ్రౌన్ రైస్, కినోవా, ఆలివ్ ఆయిల్, అవకాడో, వాల్ నట్స్, బాదంపప్పు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చేపలు, అవిసె గింజలు, టోఫు, పప్పు దినుసులు, శనగలు, కాఫీ, వెల్లుల్లి, గ్రీన్ టీ, పసుపు వంటివన్నీ లివర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఫ్యాటీ లివర్ నుంచి త్వరగా బయట పడేలా చేస్తాయి. కనుక ఈ ఆహారాలను రోజూ తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# సీతాఫలాలను అసలు ఎవరు తినకూడదు

## వీటిని తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయి..?

సీజనల్ పండ్లు అంటే సహజంగానే చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. మనకు ఏడాదిలో వచ్చే ఆయా సీజన్లలో పలు రకాల పండ్లు లభిస్తుంటాయి. వాటిని తింటే ఎన్నో పోషకాలను, ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇక అలాంటి పండ్లలో సీతాఫలాలు కూడా ఒకటి. ఇవి ఈ సీజన్‌లో అధికంగా లభిస్తుంటాయి. వీటిని చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఇవి ఎంతో తియ్యగా అద్భుతమైన రుచిని కలిగి ఉంటాయి. సీతాఫలాల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్, కారెనోయిక్ యాసిడ్ ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. దీని వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా ఉంటాయి. సీతాఫలాల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఇన్‌ఫెక్షన్లతోపాటు దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గుతాయి.



**మలబద్ధకానికి చెక్..**

సీతాఫలాల్లో లుటీన్, జియాజాంతిన్ అనే పోషకాలు ఉంటాయి. ఇవి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. డిజిటల్ తెరలను చూడడం వల్ల కళ్లపై పడే నీలి కిరణాల ప్రభావం తగ్గుతుంది. అలాగే సూర్యుని నుంచి విడుదలయ్యే అతినీలలోహిత కిరణాల బారి నుంచి కూడా కళ్లకు రక్షణ లభిస్తుంది. దీంతో కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అదేవిధంగా వృద్ధాప్యంలో కళ్లలో శుక్లాలు ఏర్పడకుండా ఉంటాయి. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. విటమిన్ సి వల్ల శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తుంది. దీంతో చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది. సీతాఫలాల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక ఈ పండ్లను తింటే మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

**బీపీ తగ్గేందుకు..**

ఈ పండ్లలో పొటాషియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి బీపీని నియంత్రించడంలో సహాయం చేస్తాయి. శరీరంలోని ద్రవాలను సమతుల్యంలో ఉంచుతాయి. దీంతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. శరీరంలో సోడియం స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. దీని వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. బీపీ తగ్గుతుంది. కిడ్నీలపై పడే భారం తగ్గుతుంది. హృదయ సంబంధిత వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. సీతాఫలాల్లో అనేక బి కాంప్లెక్స్ విటమిన్లు ఉంటాయి. ఇవి నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. మెదడు యాక్టివ్‌గా, ఉత్సాహంగా పనిచేసేలా చేస్తాయి. దీని వల్ల మూడ్ మారుతుంది. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ తగ్గుతాయి. మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ఈ పండ్లను తింటే శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. దీని వల్ల యాక్టివ్‌గా ఉంటారు, ఉత్సాహంగా పనిచేస్తారు. బద్ధకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి.

**ఎవరు తినకూడదు..?**

సీతాఫలాలను 100 గ్రాముల మోతాదులో తింటే సుమారుగా 101 క్యాలరీల శక్తి లభిస్తుంది. పిండి పదార్థాలు 25 గ్రాములు, సహజసిద్ధమైన చక్కెరలు 12.7 గ్రాములు, ఫైబర్ 2.4 గ్రాములు, ప్రోటీన్లు 1.7 గ్రాములు ఉంటాయి. అధిక మొత్తాల్లో విటమిన్లు సి, బి6, పొటాషియం, మెగ్నిషియం, ఐరన్ కూడా ఉంటాయి. ఇక సీతాఫలాలను ఎవరైనా సరే తినవచ్చు. కానీ డయాబెటిస్ ఉన్నవారు అధికంగా తినకూడదు. షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటే 50 గ్రాముల మోతాదులో లేదా ఒక పండును తినవచ్చు. షుగర్ నియంత్రణలో లేకపోతే ఈ పండ్లను తినకూడదు. అలాగే బరువు తగ్గాలనే ప్రణాళికలో ఉన్నవారు కూడా ఈ పండ్లకు దూరంగా ఉంటే మంచిది. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ సీతాఫలాలను తింటుంటే అనేక లాభాలు కలుగుతాయి.

